క్లుప్తంగా

మార్షల్‌ఆర్ట్స్‌లో గుర్తింపు తెచ్చుకోండి



మార్షల్‌ఆర్ట్స్‌లో తలపడుతున్న చిన్నారులు

కర్నూలు (టౌన్‌): మార్షల్‌ ఆర్ట్స్‌లో సాధన చేసి గుర్తింపు తెచ్చుకోవాలని జిల్లా ఉషూ సంఘం అధ్యక్షుడు గూడురు గోపాల్‌ సూచించారు. మంగళవారం స్థానిక పెద్ద మార్కెట్‌ వద్ద ఉన్న ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో వేసవి ఉచిత ఉషూ శిక్షణ శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉషూ వంటి క్రీడాంశం ద్వారా ఆత్మరక్షణతో పాటు ఆరోగ్యం పెంపొందుతుందన్నారు. ప్రతి రోజు క్రమం తప్పకుండా మార్షల్‌ఆర్ట్స్‌లో సాధన చేయాలన్నారు. జిల్లా ఒలింపిక్‌ సంఘం కార్యదర్శి జి.శ్రీనివాసులు, ఉషూ సంఘం కార్యదర్శి టీ. శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

11న బాస్కెట్‌బాల్‌ ఎంపిక పోటీలు

కర్నూలు (టౌన్‌): స్థానిక బిక్యాంపు సిల్వర్‌ జూబ్లీ కళాశాల క్రీడా మైదానంలో ఈనెల 11వ తేదీన జిల్లాస్థాయి యూత్‌ బాల బాలికల ఎంపిక పోటీలు నిర్వహించనున్నట్లు బాస్కెట్‌ బాల్‌ సంఘం కార్యదర్శి భానుప్రకాష్‌ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాస్థాయిలో ప్రతిభ కనబరచిన క్రీడాకారులను ఈనెల 16 నుంచి 19 వరకు పశ్చిమగోదావరి జిల్లా పాలకొల్లులో నిర్వహించనున్న 6వ రాష్ట్రస్థాయి యూత్‌ బాస్కెట్‌ బాల్‌ పోటీలకు ఎంపిక చేస్తామన్నారు. 2007 జనవరి 1 తర్వాత పుట్టిన వారు అర్హులని, క్రీడాకారులు జనన ధ్రువీకరణ పత్రం, ఆధార్‌కార్డు జిరాక్స్‌ వెంట తీసుకురావాలని సూచించారు. వివరాలకు 79891 73121 సెల్‌ నంబర్‌ను సంప్రదించాలన్నారు.

నేడు చేనేత యంత్ర పరికరాల పంపిణీ

కర్నూలు(అగ్రికల్చర్‌): ఈ నెల 10వ తేదీన ఆదోనిలో జరిగే కార్యక్రమంలో చేనేతకారులకు ఆధునాతన పరికరాలు పంపిణీ చేయనున్నట్లు జిల్లా చేనేత, జౌళి శాఖ సహాయ సంచాలకులు హరికృష్ణ తెలిపారు. ఆదోని వీవర్స్‌ కాలనీలోని నీలకంఠేశ్వర ఫంక్షన్‌ హాల్‌లో బుధవారం ఉదయం 10.30 గంటలకు జరిగే కార్యక్రమంలో ఆధునాతన వస్త్రాల తయారీకి అవసరమయ్యే దాదాపు రూ.40 లక్షల యంత్రాలు, ఇతర పనిముట్లు పంపిణీ చేయనున్నట్లు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. కార్యక్రమంలో జిల్లా కలెక్టర్‌ సృజన, ఎంపీ సంజీవ్‌ కుమార్‌, ఆదోని ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి, ఎమ్మెల్సీ మధుసూదన్‌, ఆదోని సబ్‌ కలెక్టర్‌ అభిషేక్‌కుమార్‌ పాల్గొంటారని తెలిపారు. త్వరలోనే ఎమ్మిగనూరులో కూడా ఈ పరికరాలు పంపిణీ చేస్తామని పేర్కొన్నారు.

నిరుద్యోగ యువతకు శిక్షణ

కర్నూలు సిటీ: ఇంటర్మీడియెట్‌, డిగ్రీ, బీటెక్‌, ఎంటెక్‌, పీజీ కోర్సులు పూర్తి చేసినా ఉద్యోగం పొందలేకపోతున్న యువతలకు ఉచిత శిక్షణ, వసతి సదుపాయాలు కల్పించనున్నట్లు కోర్స్‌ డైరెక్టర్‌, రాయలసీమ విద్యార్థి పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు రవికుమార్‌ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఐఆర్‌ఎస్‌ అధికారి బి.యాదగిరి, అమీలియో హాస్పిటల్స్‌ అధినేత డాక్టర్‌ లక్ష్మీప్రసాద్‌ పినాక సంస్థ ఆధ్వర్యంలో ఈ నెల 15వ తేదీ నుంచి స్పోకెన్‌ ఇంగ్లీష్‌, కమ్యూనికేషన్‌ స్కిల్స్‌, పర్సనాలిటీ డెవలప్‌మెంట్‌, జీకే, గ్రూప్స్‌, సివిల్‌ గైడెన్స్‌ కోర్సులలో 21 రోజుల పాటు ఉచితంగా కర్నూలు నగరంలోని సాయిసుబ్బయ్య రవీంద్ర హైస్కూల్‌ (బిషప్‌ చర్చి–నంద్యాల చెక్‌పోస్టు)లో శిక్షణ ఉంటుందని వివరించారు. పూర్తి వివరాలకు 91777 64147, 63010 95744 నంబర్లను సంప్రదించాలని సూచించారు.

వక్ఫ్‌ ఫండ్‌ వసూలు చేయండి

కర్నూలు(రాజ్‌విహార్‌): ఉమ్మడి జిల్లాల్లో బకాయి ఉన్న వక్ఫ్‌ గుత్త సొమ్ము (ఫండ్‌)ను వసూలు చేయాలని రాష్ట్ర వక్ఫ్‌ బోర్డు ఇన్‌చార్జ్‌ చీఫ్‌ ఎగ్జిక్యూటివ్‌ ఆఫీసర్‌ నూర్‌ సాహెబ్‌ సూచించారు. మంగళవారం ఆయన విజయవాడ నుంచి వీడియో కాన్ఫరెన్స్‌ ద్వారా సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ కర్నూలుతో పాటు నంద్యాల జిల్లాల్లో ప్రతి ఏటా రావాల్సిన ఫండ్‌ను రాబట్టాలన్నారు. దీనితో పాటు అన్యాక్రాంతం అవుతున్న మసీదు, దర్గాల భూములను కాపాడాల్సిన అవసరం ఉందని చెప్పారు. కర్నూలు, ఆదోని, నంద్యాల ఇన్‌స్పెక్టర్లు అల్తాఫ్‌, అజీమ్‌, ఇమ్రాన్‌ పాల్గొన్నారు.

కరాటేతో ఆత్మరక్షణ



కరాటేలో శిక్షణ పొందుతున్న చిన్నారులు

కర్నూలు(సెంట్రల్‌): ఆత్మరక్షణ కోసం ప్రతి విద్యార్థి కరాటేలో శిక్షణ పొందాలని ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి ఎస్‌.మునెప్ప సూచించారు. మంగళవారం సీఆర్‌ భవన్‌లో ఏఐవైఎఫ్‌ ఆధ్వర్యంలో నిర్వహించనున్న ఉచిత కరాటే శిక్షణను ఆయన ప్రారంభించారు. సీపీఐ నగర కార్యదర్శి రామకృష్ణారెడ్డి, ఏఐవైఎఫ్‌ నాయకులు శ్రీనివాసులు, కారుమంచి, బీసన్న పాల్గొన్నారు.

లింగ నిర్ధారణ పరీక్షలు చేస్తే కఠిన చర్యలు



హాజరైన వైద్యాధికారులు (ఇన్‌సెట్‌) మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్‌ డాక్టర్‌ సృజన

కర్నూలు(హాస్పిటల్‌): జిల్లాలో గర్భస్థ పిండ లింగ నిర్ధారణ పరీక్షలుచేసే స్కానింగ్‌ సెంటర్లపై కఠిన చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్‌ డాక్టర్‌ సృజన ఆదేశాలు జారీ చేశారు. అనుమతి లేని స్కానింగ్‌ సెంటర్లపై ప్రత్యేక నిఘా ఉంచాలని సూచించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్‌ హాలులో.. మాతృ మరణాల నివారణపై వైద్య సిబ్బందితో ఆమె సమీక్ష సమావేశం నిర్వహించారు. జిల్లాలో గర్భిణుల ప్రసవ సమయంలో మాతృ మరణాలు జరగకుండా తగిన చర్యలు తీసుకోవాలన్నారు. నగరంలో ఎన్ని స్కానింగ్‌ సెంటర్లు ఉన్నాయో గుర్తించి వాటిపై ప్రత్యేక దృష్టి సారించడంతో పాటు సదరు స్కానింగ్‌ యంత్రాల వివరాలు కూడా సేకరించాన్నారు. లింగనిర్ధారణ పరీక్షలు జరిపితే చట్ట ప్రకారం చర్యలు తప్పవని ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. గ్రామాల్లో వైద్యులు అందుబాటులో లేని సమయంలో ఆయాలు అందుబాటులో ఉండాలన్నారు. రక్తహీనత కలిగిన వారికి ఐరన్‌ ఫోలిక్‌ యాసిడ్‌ మాత్రలు అందించాలని సూచించారు. ఒకరి కంటే ఎక్కువ ఆడపిల్లలకు జన్మనిచ్చిన తల్లుల వివరాలు సేకరించాలని డీఎంహెచ్‌ఓ, ఐసీడీఎస్‌ పీడీలను ఆదేశించారు. గ్రామాల్లో బాల్యవివాహాలు జరగకుండా చూడాల్సిన బాధ్యత ఆశా, ఏఎన్‌ఎంలపై ఉందన్నారు. బాల్య వివాహాలను ఆపలేకపోతే ఐసీడీఎస్‌ అధికారులకు తెలియజేయాలని సూచించారు. ఏఎన్‌ఎంలు లేని సచివాలయాలు ఎన్ని ఉన్నాయో వివరాలు తెలపాలని డీఎంహెచ్‌ఓకు సూచించారు. గ్రామాల్లో గర్భిణులను పరీక్షించేందుకు పోర్టబుల్‌ అల్ట్రాసౌండ్‌ మిషన్‌ ఉపయోగకరంగా ఉంటుందని, అందుకు తగిన చర్యలు తీసుకోవాలని డీఎంహెచ్‌ఓకు గైనిక్‌ హెచ్‌ఓడీ విన్నవించారు. అందుకు తగిన చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్‌ తెలిపారు. డీఎంహెచ్‌ఓ డాక్టర్‌ రామగిడ్డయ్య, డీసీహెచ్‌ఎస్‌ డాక్టర్‌ రాంజీనాయక్‌, వైద్యాధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

సమస్యలుంటే నేరుగా కలవండి



అర్జీ స్వీకరిస్తున్న ఎమ్మెల్యే హాఫీజ్‌ఖాన్‌

కర్నూలు(రాజ్‌విహార్‌): కర్నూలు నియోజకవర్గ ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి అధిక ప్రాధాన్యత ఇవ్వనున్నట్లు ఎమ్మెల్యే హఫీజ్‌ఖాన్‌ అన్నారు. మంగళవారం ఆయన స్థానిక పాతబస్తీలోని కార్యాలయంలో ప్రజాదర్బార్‌ కార్యక్రమం ద్వారా వినతిపత్రాలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజలు స్థానిక సమస్యలు రోడ్లు, డ్రైనేజీ కాల్వలు, కల్వర్టు, మంచినీరు, ఇతర సమస్యలను చెప్పుకునేందుకు తనను నేరుగా కలవవచ్చని చెప్పారు. నిరంతరం అందుబాటులో ఉంటానని స్పష్టం చేశారు.

లోపాయికారి రాజకీయాలు టీడీపీకే చెల్లు



మాట్లాడుతున్న ఎస్వీ మోహన్‌రెడ్డి

కర్నూలు(రాజ్‌విహార్‌): ఆరోపణలు నిరూపించలేని అసమర్థత టీడీపీ నాయకులది అని, జనం దృష్టి మరల్చడానికే లేనిపోని ఆరోపణలు చేస్తున్నారని మాజీ ఎమ్మెల్యే ఎస్వీ మోహన్‌రెడ్డి మండిపడ్డారు. మంగళవారం స్థానిక ఎస్వీ కాంప్లెక్స్‌లోని తన కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ.. టీడీపీ నేతలు సోమిశెట్టి, టీజీ భరత్‌, టీటీ నాయుడు చేసిన ఆరోపణలను ఖండించారు. కర్నూలు ఎమ్మెల్యే హఫీజ్‌ఖాన్‌పై తాను సీఎంకు ఫిర్యాదు చేశానన్నది అవాస్తవం అని స్పష్టం చేశారు. తాను సీఎంను కలిసి ఉంటే చూసినవారు వచ్చి సమాధానం చెప్పాలని, లేదా మాట్లాడినట్లు ఆధారాలు, కాల్‌ రికార్డింగ్స్‌ ఉంటే చూపాలని డిమాండ్‌ చేశారు. లోపాయికారి రాజకీయాలు చేయడం టీడీపీ నేతలకు చెల్లు అని, అనవసరంగా తనను ఇందులోకి లాగుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కర్నూలు జిల్లాలో యువగళం పాదయాత్ర అట్టర్‌ఫ్లాప్‌ అయ్యిందని, పార్టీ జాతీయ కార్యదర్శి వస్తే కనీసం 300 మంది ప్రజలను రప్పించుకోలేకపోయారని ఎద్దేవా చేశారు. పాదయాత్రలో ఏ నియోజకవర్గానికి వెళితే అక్కడి ఎమ్మెల్యేపై అసత్య ఆరోపణలు చేయడం, వారు నిరూపించాలని సవాల్‌ చేస్తే మౌనంగా దాటి వెళ్లడం పరిపాటిగా మారిందన్నారు. అసత్య ఆరోపణలు మానుకోవాలని, ఇలాంటి కుయుక్తులకు పాల్పడితే గొడవలు తప్పా మంచి జరగదని హితవుపలికారు. పార్టీ నాయకులు పాల్గొన్నారు.

బాలుర వసతిగృహాన్ని తరలించండి

కర్నూలు(అర్బన్‌): తుగ్గలి మండలం రాతన గ్రామ సమీపంలో ఉన్న ప్రభుత్వ గిరిజన సంక్షేమ పాఠశాల, వసతి గృహం ఆవరణలో ఆవరణలో ఉన్న బాలుర హాస్టల్‌ను వేరే ప్రాంతానికి మార్చాలని ఆలిండియా గిరిజన ఉద్యోగుల సంఘం నేతలు కోరారు. ఈ మేరకు సంఘం జిల్లా కార్యదర్శి బీ.రాముడు, రాష్ట్ర కోశాధికారి జీ.వెంకటేశ్వర్లు, సహాధ్యక్షులు బీ.మద్దిలేటి తదితరులు జిల్లా కలెక్టర్‌ డాక్టర్‌ జి.సృజనను కలిసి వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గత 10 సంవత్సరాలుగా బాలికల పాఠశాల ఆవరణలోనే బాలుర వసతి గృహాన్ని తాత్కాలికంగా ఏర్పాటు చేయడం వల్ల బాలికలు, మహిళా టీచర్లు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఈ విషయంపై విచారణ జరిపి తగు న్యాయం చేస్తామని జిల్లా కలెక్టర్‌ హామీ ఇచ్చినట్లు తెలిపారు. కలెక్టర్‌ను కలిసిన వారిలో సంఘం నేతలు ఎస్‌ మద్దయ్య, వై పుల్లయ్య, వై నాగరాజు, ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్‌ అండ్‌ మానిటరింగ్‌ కమిటీ సభ్యులు వై రాజు ఉన్నారు.

రెజ్లర్లపై వేధింపులు తగదు



కలెక్టరేట్‌ ఎదుట ధర్నా నిర్వహిస్తున్న ఏఐటీయూసీ నాయకులు

కర్నూలు(సెంట్రల్‌): ఢిల్లీలో రెజ్లర్లను వేధిస్తున్న బీజేపీ ఎంపీ బ్రిజ్‌భూషణ్‌ శరణ్‌సింగ్‌పై కేసు నమోదు చేయాలని ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జే.లలితమ్మ డిమాండ్‌ చేశారు. మంగళవారం ఏఐటీయూసీ ఆధ్వర్యంలో రెజ్లర్లపై పోలీసుల లాఠీచార్జీకి నిరసన కలెక్టరేట్‌ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ..దేశ ఘనతను చాటి చెప్పే మహిళా రెజ్లర్లపై అధికారి పార్టీ ఎంపీ లైంగికంగా వేధిస్తుంటే ఎవరికీ చెప్పుకోవాలో తెలియడం లేదన్నారు. పైగా తమకు న్యాయం చేయాలని ఢిల్లీలో నిరసనకు దిగిన రెజ్లర్లపైనే పోలీసులు దాడి చేయడం హేయమైన చర్య అన్నారు. వెంటనే ఎంపీని భర్తరఫ్‌ చేయకపోతే పోరాటాలను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్‌.మునెప్ప, చంద్రశేఖర్‌, మనోహర్‌ మాణిక్యం పాల్గొన్నారు.

దళితుల సమస్యల పరిష్కారానికి కృషి



నాగరాజును అభినందిస్తున్న సంఘాల నాయకులు

కర్నూలు అర్బన్‌: దళితులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు చిత్తశుద్ధితో కృషి చేస్తానని ఏపీ ఎస్సీ సంక్షేమ సంఘం రాష్ట్ర వర్కింగ్‌ అధ్యక్షుడు గోన నాగరాజు అన్నారు. మంగళవారం సాయంత్రం స్థానిక కార్యాలయంలో నూతన వర్కింగ్‌ అధ్యక్షుడిగా ఎన్నికైన నాగరాజును వివిధ ప్రజా, దళిత, విద్యార్థి సంఘాల నాయకులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా నాగరాజు మాట్లాడుతూ దళితుల సమస్యల పరిష్కారానికి తన శక్తి వంచన లేకుండా కృషి చేస్తున్నామన్నారు. ఈ నేపథ్యంలో తన బాధ్యతను మరింత పెంచిన అసోసియేషన్‌ నేతలకు కృతజ్ఞతలు తెలిపారు. త్వరలోనే రాష్ట్రంలోని అన్ని జిల్లాలో పర్యటించి సంఘాన్ని మరింత ముందుకు తీసుకుపోయేందుకు కృషి చేస్తానని చెప్పారు. సంఘం జిల్లా గౌరవాధ్యక్షుడు ఎస్‌ సీహెచ్‌ బజారన్న, అధ్యక్షుడు వీఎం.వెంకటేశ్వర్లు ఉపాధ్యక్షుడు సి.సుంకన్న, ప్రధాన కార్యదర్శి ఎస్‌.సుంకన్న, కోశాధికారి సంజీవ్‌, మాల విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షులు కె.వెంకటేష్‌ తదితరులు పాల్గొన్నారు.

14న హనుమాన్‌ జయంతి వేడుకలు

కర్నూలు కల్చరల్‌: హనుమాన్‌ జయంతి పురస్కరించుకొని కర్నూలు నగర బ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో ఈనెల 14వ తేదీన సంకల్‌భాగ్‌లోని హరిహర క్షేత్రంలో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు సంఘం కార్యవర్గ సభ్యులు తెలిపారు. ఉదయం 7 గంటలకు గోపూజ, ఆంజజనేయ స్వామికి ఏకాదశ మన్యు సూక్త మధు (తేనె) అభిషేకం, నాగవల్లి దళం (తమల పాకులు)తో సహస్ర నామార్చన, మన్యు సూక్త హోమం, సాయంత్రం 6 గంటలకు అభయాంజనేయ స్వామి వారి రథోత్సవం కార్యక్రమాలు జరుగుతాయని పేర్కొన్నారు. భక్తులు అందరూ పాల్గొనవచ్చని విజ్ఞప్తి చేశారు.

మ్యాన్‌హోల్‌కు మూత

సాక్షి ఎఫెక్ట్‌

నగరంలోని మండిబజార్‌లో మ్యాన్‌హోల్‌కు మూతలేక ఏర్పడుతున్న ఇబ్బందులపై ఈ నెల 8వ తేదీన 'సాక్షి'దినపత్రికలో సచిత్ర కథనం ప్రచురితం కావడంతో మున్సిపల్‌ అధికారులు స్పందించారు. మ్యాన్‌హోల్‌పై మూతవేసి వాహనచో దకులు,పాదచారులకుఇబ్బంది లేకుండా చేశారు. సమస్యను వెలుగులోకి తెచ్చి పరిష్కారానికి కృషి చేసిన సాక్షికి స్థానికులు కృతజ్ఞతలు తెలిపారు. – కర్నూలు(హాస్పిటల్‌)



మ్యాన్‌హోల్‌పై గ్రిల్‌ ఏర్పాటు చేసిన దృశ్యం

భూసేకరణ వేగవంతం చేయండి



హాజరైన అధికారులు



మాట్లాడుతున్న జేసీ ఎన్‌.మౌర్య

కర్నూలు(సెంట్రల్‌): ఓర్వకల్‌ మెగా ఇండస్ట్రియల్‌ హబ్‌కు సంబంధించి భూసేకరణను వేగవంతం చేయాలని జాయింట్‌ కలెక్టర్‌ నారపురెడ్డి మౌర్య రెవెన్యూ అధికారులను ఆదేశించారు. ఆమె మంగళవారం తన చాంబరులో ఏపీ ఇండస్ట్రియల్‌ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్‌ కార్పొరేషన్‌, గ్రీన్‌కో, రెవెన్యూ అధికారులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఇప్పటికే సేకరించిన భూముల్లో ఏపీఐఐసీ అధికారులు అభివృద్ధి పనులు చేపట్టాలన్నారు. రోడ్లు, నీరు, విద్యుత్‌, రైల్వే సైడింగ్‌ కోసం చర్యలు తీసుకోవాలన్నారు.ఇంకా సేకరించాల్సిన భూముల వివరాలను సర్వే నంబర్ల ఆధారంగా తీసుకోవాలని ఆర్‌డీఓ హరిప్రసాదు, ఓర్వకల్‌ తహసీల్దార్‌ శివ ప్రసాద్‌రెడ్డిలను ఆదేశించారు. గ్రామాల వారీగా భూముల వివరాలను తీసుకొని పెండింగ్‌ భూసేకరణను వేగవంతం చేయాలన్నారు. అనంతరం గ్రీన్‌కో సోలార్‌ కంపెనీకి కావాల్సిన భూసేకరణపై కూడా దృష్టి సారించాలని ఆర్‌డీఓ, తహశీల్దార్లను ఆదేశించారు. అలాగే ట్రాన్స్‌మిషన్‌ లైన్‌కు భూసేకరణ,దేవదాయ శాఖకు చెల్లించాల్సిన పరిహారాలపై తనకు నివేదిక సమర్పించాలన్నారు. డీఆర్వో ఎస్వీ నాగేశ్వరరావు, ఏపీఐఐసీ జోనల్‌ మేనేజర్‌ విశ్వేశ్వరరావు, గ్రీన్‌కో సోలార్‌ కంపెనీ డిప్యూటీ ప్రాజెక్టు డైరెక్టర్‌ ఏవీఎస్‌ నాయుడు పాల్గొన్నారు.

కలెక్టరేట్‌ అభివృద్ధికి రూ.5.65 కోట్లతో ప్రతిపాదనలు

కర్నూలు(అర్బన్‌): జిల్లా కలెక్టర్‌ డాక్టర్‌ జి.సృజన ఆదేశాల మేరకు కలెక్టరేట్‌లో వివిధ అభివృద్ధి, మరమ్మతులు చేపట్టేందుకు రూ.5.65 కోట్లతో ప్రతిపాదనలు రూపొందించినట్లు ఆర్‌అండ్‌బీ ఎస్‌ఈ ఆర్‌.నాగరాజు తెలిపారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ కలెక్టరేట్‌ ఉత్తరం, దక్షిణం వైపున్న విభాగాల శ్లాబ్‌ లీకేజీ, కామన్‌ టాయ్‌లెట్ల పనులకు రూ.1.13 కోట్లతో ప్రతిపాదనలు రూపొందించామన్నారు. అలాగే ఎస్‌ఆర్‌బీసీ బ్లాక్‌, సౌత్‌ బ్లాక్‌లో ఫ్లోరింగ్‌, వాల్స్‌, టాయ్‌లెట్లు, కిటికీలు, వెంటిలేటర్ల పనులు, డీఈఓ కార్యాలయం వైపు నార్త్‌ బ్లాక్‌లో ఫ్లోరింగ్‌, పెయింటింగ్‌, ఆయా గదుల్లో అంతర్గత మరమ్మతులు, వివిధ అభివృద్ధి పనులకు రూ.4.52 కోట్లతో ప్రతిపాదనలు రూపొందించి కలెక్టర్‌కు పంపామన్నారు. చాలా కాలంగా కలెక్టరేట్‌లో ఎలాంటి మరమ్మతులు చేపట్టకపోవడం వల్ల మొదటి అంతస్తు రూఫింగ్‌, టాయిలెట్లు, వివిధ గదులు పూర్తిగా శిథిలావస్థకు చేరాయన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు



సీఓల సదస్సులో మాట్లాడుతున్న మెప్మా పీడీ నాగ శివలీల

కర్నూలు (టౌన్‌): పట్టణాల్లో అర్హులైన ప్రతి మహిళకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు చేరాలని పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్‌ నాగ శివలీల అన్నారు. మంగళవారం బి.తాండ్రపాడు టీటీడీసీ కార్యాలయంలో మున్సిపాలిటీల సీఓలు, రిసోర్స్‌ పర్సన్లకు రెండు రోజుల అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా పీడీ మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం మహిళలను ఆర్థికంగా అభివృద్ధి చేసేందుకు వైఎస్సార్‌ చేయూత, ఆసరా, సున్నావడ్డీ, జగనన్న తోడు, పేదలందరికీ ఇళ్లు వంటి ఎన్నో సంక్షేమ పథకాలు అమలు చేస్తోందన్నారు. ఈ పథకాలపై మహిళలకు విస్తృతంగా అవగాహన కల్పించాలని సూచించారు. మెప్మా పరిపాలన అధికారి నాగరాజు, ఐబి మురళీ, జిలానీ పాల్గొన్నారు.

ఉత్పత్తులకు అనుగుణంగా మార్కెటింగ్‌ సౌకర్యం



ఉల్లి సోలార్‌ డ్రయ్యర్‌ను పరిశీలిస్తున్న మార్కెటింగ్‌ జేడీ రామాంజనేయులు

కల్లూరు: గ్రామంలో ఉత్పత్తులకు అనుగుణంగా మార్కెటింగ్‌ సౌకర్యం కల్పిస్తామని మార్కెటింగ్‌ జాయింట్‌ డైరెక్టర్‌ రామాంజనేయులు అన్నారు. మంగళవారం కల్లూరు మండలం తడకనపల్లె గ్రామంలో మార్కెటింగ్‌ జాయింట్‌ డైరెక్టర్‌ రామాంజనేయులు ఉల్లి సోలార్‌ డ్రయర్‌, పాలకొవ్వ ఉత్పత్తులను పరిశీలించి ప్రజలు ఏవిధంగా లబ్ధిపొందుతున్నారో అధ్యయనం చేశారు. ఆయన స్వయంగా వెళ్లి ఉల్లి సోలార్‌ డ్రయ్యర్‌, పాలకొవ్వ తయారీ మిషన్లు, తయారీ విధానం పరిశీలించి నిర్వాహకులతో మాట్లాడారు. గ్రామంలో ఉల్లి డ్రయ్యర్లు 25 యూనిట్లు ఉన్నాయని వాటితో నెలకు రూ. 10 వేల నుంచి 18 వేలు ఆదాయం పొందుతున్నట్లు పొదుపు సంఘం మహిళ జుబేదాబీ, సభ్యులు వివరించారు.

నాడు-నేడు పనులు పూర్తి చేయండి



మాట్లాడుతున్న ఎంఈఓ శ్రీనివాసులు

కల్లూరు: పాఠశాలలు తెరిచే నాటికి (జూన్‌ 12) మనబడి నాడు–నేడు రెండవ దశలో చేపట్టిన పనులను పూర్తి చేయాలని ఎంఈఓ శ్రీనివాసులు ప్రధానోపాధ్యాయులకు సూచించారు. ఆయన మంగళవారం స్థానిక మండల పరిషత్‌ కార్యాలయంలో నాడు–నేడు పనులపై సమీక్ష నిర్వహించారు. పాఠశాలల్లో జరుగుతున్న పనుల ఖర్చు, బిల్లుల వివరాలన్నీ కాంపొనెంట్‌ ప్రకారం ఎస్‌టీఎంఎస్‌ యాప్‌లో నమోదు చేయలన్నారు. ఇంజనీరింగ్‌ అసిస్టెంట్లు కాంపొనెంట్‌ వారీగా ఫొటోలను క్యాప్చర్‌ చేయాలని ఆదేశించారు. పాఠశాల ప్రధానోపాధాయులు ఐఎఫ్‌పి ట్యాబ్స్‌ విద్యార్థులకు పంపిణీచేస్తూ విద్యార్థుల హాజరును యాప్‌లో నమోదు చేయలన్నారు. ఎంపీడీఓ జివి రమణమూర్తి, ఏపీఎం శ్రీనివాసగౌడ్‌, ఈఓఆర్డీ రవికిషోర్‌, మున్సిపల్‌ ఏఈ కృష్ణలత, ప్రధానోపాధ్యాయులు, గ్రామ సచివాలయాల ఇంజనీరింగ్‌ అసిస్టెంట్లు పాల్గొన్నారు. అనంతరం ఎంపీడీఓ అధ్యక్షతన ఓసీఎస్‌ సర్వేపై సచివాలయ వెల్ఫేర్‌ అసిస్టెంట్లు, మున్సిపాలిటీ పరిధిలోని ఎడ్యుకేషన్‌ అండ్‌ డేటా ప్రాసెసింగ్‌ సిబ్బందికి శిక్షణ కార్యక్రమం నిర్వహించారు.

14న 'రేగడి సీమ కథలు' పుస్తకావిష్కరణ

కర్నూలు కల్చరల్‌: ప్రముఖ కథా రచయిత గొరెడ్డి హరిశ్చంద్రారెడ్డి రచించిన 'రేగడి సీమ కథలు' పుస్తకావిష్కరణ కార్యక్రమం ఈనెల 14వ తేదీన నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. మద్దూరునగర్‌లోని పింగళి సూరన తెలుగు తోటలో ఉదయం 10 గంటలకు జరిగే కార్యక్రమంలో విద్యావేత్త జి.పుల్లయ్య, సాహితీవేత్త, గాడిచెర్ల ఫౌండేషన్‌ అధ్యక్షులు కురాడి చంద్రశేఖర కల్కూర, టీజీవీ కళాక్షేత్రం అధ్యక్షుడు పత్తి ఓబులయ్య, తెలుగు భాషా వికాస ఉద్యమం కార్యదర్శి జేఎస్‌ ఆర్కే శర్మ, దీపక్‌ తేజ హాస్పిటల్‌ అధినేత డాక్టర్‌ రామచంద్రనాయుడు అతిథులుగా హాజరై పుస్తకాన్ని ఆవిష్కరిస్తారని పేర్కొన్నారు. సాహితీ ప్రియులు అందరూ పాల్గొన వచ్చని విజ్ఞప్తి చేశారు.

12న కల్యాణోత్సవం

కర్నూలు కల్చరల్‌: శ్రీ లలితా సుందరేశ్వర స్వామివార్ల అష్టమ విగ్రహ ప్రతిష్టాపన వార్షికోత్సవం పురస్కరించుకొని ఈనెల 12వ తేదీన స్వామి వార్ల కల్యాణం నిర్వహించనున్నట్లు పీఠాధిపతి మేడా సుబ్రహ్మణ్య స్వామి తెలిపారు. ఓల్డ్‌సిటీలోని లలితా పీఠంలో సాయంత్రం 6 గంటలకు జరిగే వేడుకలో భక్తులు అందరూ పాల్గొనవచ్చని విజ్ఞప్తి చేశారు.

సెలవుల్లో కమిషనర్‌

కర్నూలు (టౌన్‌): నగరపాలక కమిషనర్‌ ఏ.భార్గవ్‌తేజ మంగళవారం నుంచి శనివారం వరకు సెలవుల్లో ఉంటారు. వ్యక్తిగత కారణాలతో ఆయన సెలవుల్లో ఉండటంతో ఇన్‌చార్జ్‌ కమిషనర్‌గా అడిషనల్‌ కమిషనర్‌ రామలింగేశ్వర్‌ వ్యవరించనున్నారు.

హనుమాన్‌ చాలీసా పారాయణం

కర్నూలు కల్చరల్‌: విశ్వ హిందూ పరిషత్‌, బజరంగ్‌ దల్‌ సంయుక్త ఆధ్వర్యంలో మంగళవారం అన్ని ఆలయాల్లో హనుమాన్‌ చాలీసా పారాయణం చేశారు. బళ్లారి చౌరస్తాలోని అభయాంజనేయ స్వామి ఆలయంలో జరిగిన కార్యక్రమంలో వీహెచ్‌పీ జిల్లా అధ్యక్షుడు గోరంట్ల రమణ మాట్లాడుతూ.. కర్ణాటక ఎన్నికల్లో కాంగ్రెస్‌ తన మేనిఫెస్టోలో ఉగ్రవాద మూలాలు కలిగిన పీఎఫ్‌ఐ సంస్థతో కలిపి జాతీయ భావాలు, దేశ భక్తి కలిగిన బజరంగ్‌దల్‌ను కూడా నిషేధిస్తామని ప్రకటించడాన్ని నిరసిస్తూ హనుమాన్‌ చాలీసా పఠనం చేశామన్నారు. ముస్లిం ఓటు బ్యాంక్‌ కోసం పీఎఫ్‌ఐ లాంటి దేశ ద్రోహానికి పాల్పడే సంస్థలతో సమానంగా బజరంగ్‌ దల్‌ను పోల్చుతూ ముస్లింలకు దగ్గరవ్వాలనే ప్రయత్నాలు చేస్తున్నారని ఆరోపించారు. కాంగ్రెస్‌ నేతలకు సద్బుద్ధిని కలిగించాలని ఆలయాల్లో పూజలు చేశామన్నారు. కార్యక్రమంలో నగర అధ్యక్షుడు మద్దిలేటి, బజరంగ్‌ దల్‌ కర్నూలు నగర సంయోజక్‌ నాగరాజు, నాయకులు అరుణ్‌కుమార్‌ రెడ్డి, సురేష్‌ తదితరులు పాల్గొన్నారు.

నైతిక విలువలపై ప్రత్యేక తరగతులు

కర్నూలు కల్చరల్‌: గ్రంథాలయ సంస్థ ఆధ్వర్యంలో జిల్లా కేంద్ర గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి సాధనా శిబిరంలో మంగళవారం 'నైతిక విలువలు – బాధ్యతలు' పై ప్రత్యేక తరగతులు నిర్వహించారు. విశ్రాంత అధ్యాపకులు టి.డి హుసేన్‌ పీరా విద్యార్థులకు కథల రూపంలో వివరించారు. డిప్యూటీ లైబ్రేరియన్‌ పెద్దక్క మాట్లాడుతూ సమ్మర్‌ క్యాంప్‌ ఈనెల 16వ తేదీ వరకు కొనసాగుతుందన్నారు. శిబిరంలో కథలు చదివి వినిపించడం, పుస్తకాలు చదవడం, స్పోకెన్‌ ఇంగ్లీష్‌, పెయింటింగ్‌, డ్రాయింగ్‌, పేపర్‌ క్రాఫ్ట్‌, యోగా, మెడిటేషన్‌లో బీటీ శర్మ, రాఘవరెడ్డి, సుధాకర్‌రెడ్డి శిక్షణ ఇస్తున్నారన్నారు. గ్రంథాలయాధికారులు, విద్యార్థులు పాల్గొన్నారు.

డ్రైవర్‌ ఆత్మహత్య

కర్నూలు: 'నా చావుకు ఏవరూ బాధ్యులు కారు. ఆరోగ్య సమస్యతో ఆత్మహత్య చేసుకుంటున్నా' అని సూసైడ్‌ లెటర్‌ రాసి కర్నూలు పాతబస్తీ చిత్తారీ వీధికి చెందిన పవన్‌కుమార్‌ (22) ఇంట్లో ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. గోస్పాడు మండలం దీబగుంట్ల గ్రామానికి చెందిన పవన్‌కుమార్‌ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. చిత్తారివీధికి చెందిన అనితను ఏడాది క్రితం పెళ్లి చేసుకొని కర్నూలులో నివసిస్తున్నాడు. అనిత కొరియర్‌ సంస్థలో ఉద్యోగం చేస్తుంది. సోమవారం రాత్రి ఆమె విధుల నుంచి ఇంటికి వచ్చేలోపు పవన్‌కుమార్‌ ఉరికి వేళాడుతూ కనిపించాడు. కిందికి దింపి ఆసుపత్రికి తీసుకెళ్లగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. తల్లి వెంకటలక్ష్మమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఒకటవ పట్టణ పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

వార్డు కార్యదర్శులకు మెమోలు

కర్నూలు (టౌన్‌): నగర పాలక సంస్థ పరిధిలోని వివిధ సచివాలయాల్లో పనిచేస్తున్న వార్డు శానిటేషన్‌ కార్యదర్శులతో పాటు శానిటరీ ఇన్‌స్పెక్టర్లకు నగరపాలక డిప్యూటీ కమిషనర్‌ ఎస్వీ రమాదేవి మంగళవారం మెమోలు జారీ చేశారు. 1 నుంచి 9వ డివిజన్‌, 11 నుంచి 13వ డివిజన్‌, 15 నుంచి 17వ డివిజన్‌ వరకు పనిచేస్తున్న వార్డు శానిటేషన్‌ కార్యదర్శులు యూజర్‌ చార్జీలు వసూలు చేయడంలో అలసత్వం ప్రదర్శించడం, నిర్ణీత లక్ష్యాలు చేరుకోవడంలో విఫలం చెందడంతో మెమోలు జారీ చేశారు.

గ్రేడ్‌-1 సూపర్‌వైజర్లకు పోస్టింగ్స్‌

కర్నూలు(రాజ్‌విహార్‌): మహిళ, శిశు సంక్షేమ, సాధికార శాఖలో అర్హత సాధించిన ఎక్స్‌టెన్షన్‌ ఆఫీసర్‌/ గ్రేడ్‌–1 సూపర్‌వైజర్‌ అభ్యర్థులకు పోస్టింగ్స్‌కు సంబంధించిన అర్డర్స్‌ సిద్ధం చేశారు. మంగళవారం ఆ శాఖ రీజినల్‌ జాయింట్‌ డైరెక్టర్‌ పద్మజ స్థానిక సీ.క్యాంప్‌ వద్ద ఉన్న తమ కార్యాలయంలో అభ్యర్థులకు స్థానాలు కేటాయించారు. ఈ నెల 6వ తేదీన కౌన్సిలింగ్‌ నిర్వహించి వారి ఒరిజినల్‌ ధ్రువపత్రాలను పరిశీలించిన విషయం తెలిసిందే. వీరంతా గతంలో ఏపీపీఎస్సీ నిర్వహించిన రాత పరీక్షల్లో కర్నూలు జోన్‌ (కర్నూలు, వైఎస్‌ఆర్‌ కడప, అనంతరపుం, చిత్తూరు ఉమ్మడి జిల్లాలు) నుంచి ఉద్యోగానికి అర్హత సాధించిన అభ్యర్థులు. ఆరుగురిలో ఐదు మందికి పోస్టింగ్స్‌ ఇచ్చామని, ఒకరు ఎస్టీ కావడంతో ధ్రువీకరణ కోసం డైరెక్టరేట్‌కు రాసినట్లు ఆర్‌జేడీ పేర్కొన్నారు.

ముందస్తు అడ్మిషన్లను అరికట్టాలి

కర్నూలు(సెంట్రల్‌): జిల్లాలోని కార్పొరేట్‌, ప్రైవేట్‌ విద్యాసంస్థల్లో ముందస్తు అడ్మిషన్లను అరికట్టాలని పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు అఖండ, బి.మహేంద్రబాబు డిమాండ్‌చేశారు. మంగళవారం పీడీఎస్‌యూ, పీవైఎల్‌ ఆధ్వర్యంలో కలెక్టరేట్‌ ఎదుట ధర్నా నిర్వహించారు. వారు మాట్లాడుతూ జిల్లాలో నిబంధనలకు విరుద్ధంగా అడ్మిషన్లు చేపడుతున్న పాఠశాలలు, ఇంటర్‌ కాలేజీలపై చర్యలు తీసుకోవాలని కోరారు.